క్లుప్తంగా

సీఎం జగన్‌కు శుభాకాంక్షలు తెలిపిన దొరబాబు



సీఎం జగన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన దవులూరి దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యప్ప విగ్రహం ఊరేగింపు



రథంలో ఊరేగుతున్న అయ్యప్ప స్వామి

కొత్తపల్లి: ఇటీవల సముద్రంలో మత్స్యకారుని వలలో లభించిన అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఉప్పాడ శివారు సుబ్బంపేట గ్రామస్తులు సోమవారం గ్రామాల్లో రథంలో ఊరేగించారు. ఉప్పాడ, అమీనాబాదు, కొత్తపల్లి తదితర గ్రామాల్లో స్వామి వారి రథంలో ఊరేగించగా భక్తులు దర్శించుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ




పెద్దాపురంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీ ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

పెద్దాపురం: ఉద్యోగ సంఘాలకు మద్దతుగా చేసే పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీ ఎన్‌జీఓ సంఘం పెద్దాపురం శాఖ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీఓ సంఘ కార్యాలయంలో సోమవారం ఏపీ ఎన్‌జీఓ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉద్యోగ సంఘాల డిమాండ్ల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రమోద్, సీహెచ్‌వీ సత్యనారాయణ, అభిషేక్, సాయిబాబు, ఉమాదేవి, విశాలాక్షి, శ్రీవల్లి, అనిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి: పురుగుల మందు తాగి ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. కొత్తపల్లిలో వ్యవసాయ సహకార పరపతి సంఘంలో గుమాస్తాగా పనిచేస్తున్న గోనెల శాంతిస్వరూప్‌ను సొసైటీ కార్యదర్శి మందలించడమే కాకుండా మరుసటి రోజున న్యూ ఇయర్‌కు సంబంధించి ఫ్లెక్సీలను కట్టమని చెప్పారు. మనస్థాపానికి గురై గత డిసెంబరు 31తేదీన పొలాల్లోకి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు కాకినాడలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఎస్ రద్దు కోరుతూ ఉపాధ్యాయుల ధర్నా



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం సాయంత్రం 2కే వాక్ చేశారు. స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి మెహర్‌కాంప్లెక్స్, మఠంసెంటర్ మీదుగా స్టేషన్ సెంటర్ చేరుకొన్నారు. అక్కడ సీపీఎస్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీజీవీ చక్రవర్తి, జిల్లా కార్యదర్శి పి.అన్నవరం, జిల్లా ప్రతినిధి పి.గిరిధర గోపాలరావు, పట్టణ అధ్యక్షుడు ఎస్.రాజా, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



ముక్కోటి ఏకాదశి సందర్భంగా కుంతీమాధవస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో తిరుపతి శృంగార వల్లభస్వామి



సామర్లకోటలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



శృంగారవల్లభస్వామి సన్నిధిలో భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న ఈఓ తదితరులు

కనుల వైకుంఠం

- తెరచుకున్న ఉత్తర ద్వారాలు
- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామివారికి విశేష పూజలు



గోర్స పురాతన రామాలయంలో సంకీర్తన ఆలపిస్తున్న భక్తులు



సామర్లకోటలో మాండవ్య నారాయణస్వామిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుంటున్న భక్తులు



వేట్లపాలెంలో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పిఠాపురం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం వైష్ణవాలయాల్లో గోవిందనామస్మరణ మారుమోగింది. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారి దర్శనాలకు ఉత్తర (వైకుంఠ) ద్వారాలు తెరచుకోవడంతో వేలాది మంది భక్తులు ఉత్తరద్వార దర్శనానికి పోటెత్తారు. ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి రోజున వైష్ణవాలయాల్లో స్వామివారిని దర్శించేందుకు దేవతలు భువి నుంచి దివికి దిగివస్తారనే నానుడి ఉండడంతో ఉత్తరద్వారాలు తెరుస్తారు. సోమవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉత్తర ద్వారాలను తెరవడంతో భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. సుమారు 50 వేల మంది భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు.

పంచమాధవ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన పిఠాపురంలో వేంచేసియున్న శ్రీకుంతీ మాధవస్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, శ్రీ గోదా అమ్మవారికి శ్రీ చూర్ణం అర్చన, 3 గంటలకు ద్రవిడ ప్రబంధ పారాయణ, తీర్థ ప్రసాద వినియోగం, అనంతరం శ్రీ స్వామివారికి, శ్రీ అమ్మవార్లకు, శ్రీ ఆళ్వార్ సమక్షంలో శ్రీ స్వామి కల్యాణ మంటపంలో వార్షిక అధ్యయనోత్సవం ప్రారంభించారు. 4 గంటలకు వైకుంఠద్వార దర్శనం, అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. వైకుంఠద్వార దర్శనం రాత్రి 9 గంటల వరకు కొనసాగించారు. స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, శ్రీ సీతారామాంజనేయ స్వామివారి ఆలయాలలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తరద్వార దర్శనంతో పాటు దశావతారాల పూజ, నిత్యదేవతార్చనలు నిర్వహించారు. కొత్తపల్లిలో వేంచేసియున్న శ్రీ ధర్మశాస్తా దేవస్థానంలోని వేంకటేశ్వరస్వామి సన్నిధిలోను, స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలోనూ ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు ఉప్పాడ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం, సాయంత్రం విష్ణుసహస్రనామాలు శ్రీ లక్ష్మి వేంకటేశ్వర దేవాలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

పెద్దాపురం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుంచి ఆలయాలకు భక్తులు పోటేత్తారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని జి.రాగంపేట వేణుగోపాల స్వామి, కట్టమూరు కేశవపట్టాభి స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శృంగార వల్లభస్వామి సన్నిధిలో..

జిల్లాలో తొలి తిరుపతి స్వయంభూ శృంగారవల్లభ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షులు గోపు మురళి తదితరులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సంకీర్తన, సప్తాహ మహోత్సవం ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, సర్పంచ్ కనపర్తి చీమదొర పాల్గొన్నారు.

నగర సంకీర్తన

మండలంలోని కాండ్రకోటలో నగర సంకీర్తన నిర్వహించారు. గీతా సంఘం ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపిస్తూ నగర సంకీర్తన చేశారు. అనంతరం ఉలిమేశ్వరం, చదలాడ మీదుగా తిరుపతి శంగార వల్లభ స్వామిన సన్నిధి వరకూ పాదయాత్ర నిర్వహించారు.

దేవాలయాల్లో ఏకాహం, భజనలు

కొత్తపల్లి: మండలం ఉన్న పలు వైష్ణవ ఆలయాల్లో సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉప్పాడలో వేంకటేశ్వర స్వామి, కొత్తపల్లిలో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, రమణక్కపేటలో విజయ జనార్ధనస్వామి, గోర్సలో ఉన్న పురాతన సీతారామాలయంలో, నాగులాపల్లి, కొమరగిరి, ఎండపల్లి, కొండెవరం, మూలపేట, కొత్తమూలపేట, కోనపాపపేటలో ఉన్న వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో పల్లకీలో ఊరేగించారు. గోర్సలో పురాతన రామాలయంలో సీతారామస్వామి వార్లకు పంచామృతాభిషేకాలను నిర్వహించారు. పలు ఆలయాల్లో ఏకాహం చేశారు.

సామర్లకోట: ముక్కోటి ఏకాదశి వేడుకలు సామర్లకోట పట్టణ, మండల పరిధిలో ఘనంగా జరిగాయి. స్థానిక గోదావరి కాలువ ఒడ్డున వేంచేసిన అతిపురాతన విష్ణు ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పండితులు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఉత్తర ద్వారం మీదుగా భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక విఘ్నేశ్వరా థియేటర్ ఎదురుగా వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు స్వామిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుడు నమ్మి శ్రీనివాసు ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు. పట్టణ పరిధిలోని జగదీశ్వరస్వామి ఆలయం, పాత సామర్లకోటలోని వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. మండల పరిధిలోని వేట్లపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులకు కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు, పారిశ్రామిక వేత్త గోలి ధర్మరాజు, వల్లూరి శేఖర్ భక్తులకు సేవలందించారు.

ప్రజారోగ్యం దృష్ట్యా పందుల నిషేధం



పందుల పెంపకందారుల సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు

సామర్లకోట: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో పందులపై నిషేధం విధించినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, గోకిన సునత్రదేవి తెలిపారు. చైర్‌పర్సన్ చాంబర్‌లో సోమవారం పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. పెంపకందారులు పట్టణానికి దూరంగా పొలాలను లీజుకు తీసుకొని పందులను పెంచుకోవాలని కౌన్సిలర్లు జట్ల మోహన్, పాగా సురేష్‌కుమార్, పాలిక కుసుమచంటి డిమాండ్ చేశారు. పందుల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ప్రతిరోజూ తమకు ఫిర్యాదు చేస్తున్నారని చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు తెలిపారు. ప్రజలకు హాని జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఇక పట్టణంలో పందులను వదిలితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కుక్కల సంతతి పెరగకుండా ఆపరేషన్లు చేయించాలని నిర్ణయించామని, ఈ నెల 20 తేదీ తరువాత పట్టణంలో పందులు తిరిగితే వాటిని పట్టించి దూర ప్రాంతాలకు తరలిస్తామని హెచ్చరించారు. సక్రాంతి తరువాత పట్టణంలో పందులు ఉండవని పందుల పెంపకం దారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

90 శాతం పింఛన్ల పంపిణీ

కొత్తపల్లి: మండలంలో పింఛన్ల పంపిణీ 90శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ నందూరి ప్రభాకర రామారావు తెలిపారు. 12,750 పింఛన్లకు గానూ 11,492 పంపిణీ చేశామన్నారు. వీటిలో 443 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని వీటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేస్తామని తెలిపారు.

వాటర్ ట్యాంక్‌కు స్థలదానం



వాటర్ ట్యాంక్ నిర్మాణ స్థల డాక్యుమెంట్లను ఎమ్మెల్యే కన్నబాబుకు అందజేస్తున్న దాత రెడ్డి శ్రీనివాసరావు

కాకినాడ: మండలంలోని కొవ్వూరు గ్రామంలో జల జీవన్‌మిషన్ పథకం నిధులతో ఓహెచ్‌ఆర్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన రెడ్డి శ్రీనివాసరావు తన స్థలాన్ని దానం చేశారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి సుమారు రూ.9లక్షల విలువైన మూడు సెంట్లు స్థలం డాక్యుమెంట్లను ఎమ్మెల్యే కన్నబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత రెడ్డి శ్రీనివాసరావును ఎమ్మెల్యే కన్నబాబు అభినందించారు. కొవ్వూరు గ్రామ ప్రజలకు ఇంటింటికి కుళాయిల ఏర్పాటులో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి స్థలాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, గ్రామ సర్పంచ్ పిల్లి చక్రరావు, నియోజక వర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రానికి భక్తుల తాకిడి



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ముక్కోటి ఏకాదశి పర్వదినం కావడంతో తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు చేశారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో తొలి పూజ చేశారు. సాయంత్రం స్వామి వారికి లక్షపత్రి పూజ, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వేంచేసిన శ్రీమహావిష్ణు ఆలయంలో స్వామివారికి ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పట్టు వస్త్రాలతో స్వామివారిని అలంకరించి భక్తులు దర్శనాలు కల్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో 800 మందికి అన్నదానం చేశారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే స్పందన

- ఆర్డీఓ సీతారామారావు
- స్పందనకు ఎనిమిది అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతివారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. స్పందనలో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారులపై ఉందన్నారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు భూమి రీ సర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మార్చాలని, రోడ్డుకు మరమ్మతులు చేయాలని తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతీ, డిటీ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లా స్థాయిలో అందుబాటులో ఉన్న క్రీడా మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని షూటింగ్ క్రీడాకారులకు కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా సూచించారు. త్రివేండ్రంలో జరిగిన జాతీయ షూటింగ్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ జట్టు ట్రయల్స్‌కు ఎంపికైన డి.అక్షయ, 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ (రాష్ట్ర స్థాయి) రైఫిల్ షూటింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఎ.త్రితేజ్, అదే విధంగా అండర్–17 పిస్టల్ విభాగంలో బంగారు పతకం సాధించిన జి.మౌనిప్రసన్న తదితరులు సోమవారం స్పందన హాల్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులను అభినందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ బి.శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

సమాజ ప్రయోజనకర స్టార్టప్‌లపై దృష్టి సారించాలి

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): సమాజ ప్రయోజకర స్టార్టప్‌లపై దృష్టి సారించి విద్యార్థులను ప్రోత్సహించాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వర్సిటీ ఇంక్యుబేషన్ సెంటర్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ కె.వెంకటరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆవిష్కరణ కర్తలుగా తీర్చిదిద్దేందుకు వినూత్నమైన స్టార్టప్ ప్రోగ్రాంలు ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా నిర్వహించాలని సూచించారు. ఇంక్యుబేషన్ సెంటర్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ కె.వెంకటరెడ్డి మాట్లాడుతూ సమాజానికి, రైతులకు ఉపయోగపడే స్టార్టప్ ప్రోగ్రాంలు చేపట్టేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు.

పేదలకు వస్త్రదానం



పేదలకు వస్త్రదానం చేస్తున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దువులూరి సుబ్బారావు, కౌన్సిలర్లు

సామర్లకోట: తనకు ఉన్న దానిలో కొంత మొత్తం ఇతరులకు ఇచ్చువాడే నిజమైన క్రైస్తవుడని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రదేవి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు అన్నారు. స్థానిక 4వ వార్డు కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఆంధ్రా బాప్టిస్టు చర్చిలో పేదలకు వస్త్రదానం, వేయి మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పిట్టా సత్యనారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జీవీ రాఘవ, కౌన్సిలర్లు పాలిక కుసుమచంటి, జట్ల మోహన్, ఆవాల లక్ష్మీనారాయణ, గుబ్బల సత్యనారాయణ, రెడ్నం సునీత, కానేటి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



దగ్ధమైన గడ్డి ట్రాక్టర్

కాకినాడ రూరల్: ఏడీబీ రోడ్డును అనుకుని తిమ్మాపురం పరిధిలోని అచ్చంపేట జంక్షన్ వద్ద సోమవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. పెట్రోలు బంకును ఆనుకుని వెనుక వైపు ఉన్న స్థలంలో గడ్డిలోడుతో వస్తున్న ట్రాక్టర్ అగ్నిప్రమాదానికి గురైంది. పెనుమర్తి నుంచి ట్రాక్టర్‌పై గడ్డిని తీసుకుని బంకు సమీపంలోని ఖాళీ స్థలంలో అన్‌లోడ్ చేసే ప్రయత్నంలో ఉండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. వీటిని చూసి బంకులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుందనే అనుమానంతో ఏడీబీ రోడ్డు మీదుగా వెళ్లే వారు భయాందోళనకు గురయ్యారు. బంకు నిర్వాహకులు, గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ స్పందించి జేసీబీ ద్వారా ప్రమాదానికి గురైన ట్రాక్టర్ తొట్టెను పక్కకు నెట్టివేయించడంతో ప్రమాదానికి అడ్డుకట్టపడింది. సాలిపేట అగ్నిమాపక సిబ్బంది ప్రమాదస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో గడ్డితో పాటు ట్రాక్టర్ కూడా స్వల్పంగా దగ్ధం కావడంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

తుని: పిఠాపురం – గొల్లప్రోలు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. తుని జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురం సీతారాంపురానికి చెందిన బంగారు రఘు (20) రైలు పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న రైలు ఢీకొని, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పాడ తీరంలో డాల్ఫిన్ల హల్‌చల్

కాకినాడ జిల్లా ఉప్పాడ సముద్ర తీరంలో డాల్ఫిన్లు హల్‌చల్ చేస్తున్నాయి. ఇటీవల కాకినాడ, కోనసీమ జిల్లాల పరిదిలో సముద్ర తీర ప్రాంతంలో డాల్ఫిన్ల సందడి పెరిగింది. శీతాకాలంలో ఈ తీరానికి తాబేళ్లు వలస రావడం ఆనవాయితీ. డాల్ఫిన్లు సైతం ఈప్రాంతానికి రావడం పరిపాటిగా మారింది. ఇటీవల కోనసీమ జిల్లాలో ఒక డాల్ఫిన్ మృత్యువాత పడింది. సోమవారం ఉప్పాడ తీరంలో సముద్రంలో నాలుగు డాల్ఫిన్లు ఈదుతూ ఆటలాడుతు కనిపించాయి. పర్యాటకులు వీటిని ఆసక్తిగా తిలకించారు. -పిఠాపురం



ఒడ్డుకు వచ్చి ఆటలాడుతున్న డాల్ఫిన్

గురుకులాల విద్యార్థులకు రూ.8.64 లక్షల పుస్తకాల పంపిణీ



ఇంటర్మీడియేట్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థుల సౌకర్యార్థం కలెక్టర్ కృతికా శుక్లా సుమారు రూ. 8.64 లక్షల వ్యయంతో మొదటి, రెండో సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ఓఎన్‌జీసీ సీఎస్సార్ నిధులతో కలెక్టర్ కృతికా శుక్లా ప్రత్యేక చొరవతో ఈ పుస్తక వితరణ జరిగింది. వీటిని ఆయా కళాశాలల లైబ్రరీలలో ఉంచి విద్యార్థులకు అందిస్తామన్నారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ కాకినాడ జిల్లా కోఆర్డినేటర్ ఎ.మురళీకృష్ణ విద్యార్థులతో కలిసి కలెక్టర్ కృతికా శుక్లాకు కృతజ్ఞతలు తెలిపారు. జేసీ ఎస్.ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ ఉన్నారు.